క్లుప్తంగా

కసాపురంలో మాస్టర్ ప్లాన్ అమలు



వసతి గదులను కూలుస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఆవరణలో శిథిలావస్థకు చేరిన లక్ష్మణ సదనం వసతి గదులను కూల్చివేశారు. ఈసందర్భంగా ఈఓ ఎం. విజయరాజు మాట్లాడుతూ కసాపురం దేవస్థానాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే క్రమంలో భాగంగా మాస్టర్ ప్లాన్ అమలుకు శ్రీకారం చుట్టామన్నారు. అందులో భాగంగానే శిథిలావస్థకు చేరిన లక్ష్మణ సదనం అద్దె గదుల తొలగింపు ప్రక్రియను చేపట్టామన్నారు. వీటి స్థానంలో శాస్త్రోక్తంగా మాడ వీధులు, యాగశాల, ప్రసాదముల తయారీ, బుకింగ్ కౌంటర్లు, ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లను కూడా తొలగిస్తామన్నారు. అలాగే దేవస్థానం రాజగోపురం ఎదుట, పక్కన ఉన్న దుకాణాలను కూడా తొలగించి వారికి వేరే చోట షాపులు కేటాయిస్తామని ఆయన తెలిపారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

యాడికి: మండలంలోని రాయలచెరువు సచివాలయంలో మంగళవారం దసరా పండుగను పురస్కరించుకుని సర్పంచు తలారి అరుణ, నాగేష్ దంపతులు, పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్ 11 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గత ఐదు సంవత్సరాలుగా దుస్తులు, సరుకులు అందిస్తున్న సర్పంచు దంపతులకు కార్మికులు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటికి తాళం తొలగింపు

పెద్దపప్పూరు: మండలంలోని రామకోటి కాలనీలో ఆదినారాయణకు చెందిన ఇంటికి అదే కాలనీకి చెందిన చింతా రాము అనే వ్యక్తి తాళం వేసి దౌర్జన్యం చేయడాన్ని సాక్షి గత సోమవారం 'దౌర్జన్యంగా ఇంటికి తాళం' అన్న శీర్షికన వార్త ప్రచురించింది. స్పందించిన ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ ఇద్దరినీ స్టేషన్‌కు పిలిపించి సమస్యను పరిష్కరించి ఇంటికి తాళం తీయించారు. దీంతో ఆదినారాయణ సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ



సరుకులు అందజేస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని మార్కండేయ స్వామి ఆలయం ఆవరణలో మంగళవారం ఉద్యోగ, ఉపాధ్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు రేషన్ సరుకులు అందజేశారు. దాదాపు 35 మంది వృద్ధులకు రూ.47 వేలు విలువ చేసే సరుకులు అందజేసినట్లు సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కర్ణాటక బ్యాంక్ మేనేజర్ మంజునాథ్, సంస్థ గౌరవ అధ్యక్షుడు గురప్ప, అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి రామేశ్వరెడ్డి, గౌరవ సలహాదారు శ్రీరంగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ నారబోయిన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మెన్‌కు సన్మానం



లైన్‌మెన్ కృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని ఎస్‌ఎస్ పల్లికి చెందిన విద్యుత్ లైన్ మెన్ కృష్ణ మంగళవారం పదవీ విరమణ చేశారు.ఈ సందర్భంగా స్థానిక వసుధ ఫంక్షన్ హాల్లో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్‌శాఖ ఉద్యోగులు, సిబ్బంది హాజరై కృష్ణను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

హెచ్‌ఎంకు సత్కారం

యాడికి: మండలంలోని రాలయచెరువు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం డేనియల్ పదవీ విరమణ పొందారు. మంగళవారం పాఠశాలలకు సెలవు అయినా పలువురు ఉపాధ్యాయులు శాలువాలు, పూలమాలతో ఆయనను సత్కరించారు. టీచర్‌గా, హెచ్‌ఎంగా రాయలచెరువు ఉన్నత పాఠశాలకు డేనియల్ చేసిన సేవలను వారు కొనియాడారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని సుంకులమ్మ ఆలయం వద్ద పేకాట ఆడుతున్న అదే గ్రామానికి చెందిన కొండారెడ్డి, శ్రీనాథ్‌గౌడ్, హరినాథరెడ్డిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.31,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

దసరా సందడి

- జనాలతో కిక్కిరిసిన మార్కెట్లు
- పెరిగిన పూలు, పండ్ల ధరలు



గుత్తిలోని అమృత్ సినిమా థియేటర్ కాలనీలో కిక్కిరిసిన జనాలు



తాడిపత్రి పట్టణంలో ఆటోలో పూలను విక్రయిస్తున్న మహిళ

గుత్తి: గుత్తి,గుత్తి ఆర్‌ఎస్‌లలో మంగళవారం దసరా సందడి నెలకొంది. పండుగకు రెండు రోజుల ముందుగానే ప్రధాన మార్కెట్లు జనాలతో కిక్కిరిసిపోయాయి. దుస్తులు, వస్తువులు కొనుగోలు చేయడానికి గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. జనాలు భారీగా రావడంతో అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెంచేశారు. రెండు రోజుల క్రితం వరకూ మూర పూలు రూ.20 ఉండేది. ప్రస్తుతం రూ. 40 పెంచేశారు. ఆపిల్ పండ్లు కిలో రూ. 100 నుంచి రూ. 200కు పెంచారు. దీంతో కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

పూల రైతులకు పండుగ శోభ

తాడిపత్రిటౌన్: దసర పండుగ పూల రైతుల ముఖంలో చిరునవ్వులు కురిపించింది. ఒక్క సారిగా మార్కెట్‌లో పూల ధరలకు రెక్కలు రావడంతో పూల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల క్రితం వరకు కిలో బంతి పూలు రూ20, చేమంతి పూలు రూ.40 ఉండటంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. నవరాత్రుల సందర్భంగా పూలకు గిరాకీ పెరిగింది. ప్రస్తుతం మార్కెట్‌లో బంతి పూలు రూ.150, చామంతి పూలు రూ. 200 ధర పలుకుతోంది. దీంతో పెద్దపప్పూరు, యాడికి, పెద్దవడుగూరు రైతులు నేరుగా తాడిపత్రిలో ఆటోల్లో పూలను విక్రయిస్తూ నష్టాలను పూడ్చుకుంటున్నారు. ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.80 వేల వేల వరకు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పూల రైతులు దసరా పండుగతో కాస్త ఊరట చెందుతున్నారు. కొంత మంది వ్యాపారులు నేరుగా తోటల్లో పూలను కిలో రూ.60 తో కొనుగోలు చేసి మార్కెట్‌లో లాభాలకు విక్రయిస్తున్నారు. పట్టణాల్లోని మార్కెట్లకు వచ్చేందుకు వీలు లేని రైతులు వ్యాపారులకు పూల తోటలు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఊబిచెర్లలో తడిచిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

గుత్తి రూరల్: వేరుశనగ పంటలు వర్షాలకు తడిచిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన, తడిచిన వేరుశనగ తదితర పంటలను సీపీఎం నాయకులు పరిశీలించారు. సీపీఎం నాయకులు గ్రామ శివారులోని పంట పొలాల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల, నాయకులు రామకృష్ణ, మల్లేష్ మాట్లాడుతూ తొలగించిన వేరుశనగ పంట వర్షానికి నీట మునిగి కాయలు నల్లగా మారి బూజు పట్టాయన్నారు. తడిచిన పంటలను క్వింటాల్ రూ.8వేల ప్రకారం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో సుమారుగా 200 ఎకరాలకు పైగా పంటలు నీట మునిగి నష్టం వాటిల్లిందన్నారు. బాధిత రైతులకు ఇన్సూరెన్సు, ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు ఎకరాకు రూ.50 వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లికార్జున, గంగాధర్, అశోక్, రేణుక, రేవతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

పామిడి: అంబేడ్కర్ గారూ...మీరైనా మా సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం స్థానిక ఎద్దులపల్లిరోడ్డులోని ఆయన విగ్రహానికి సచివాలయ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇంటింటి సర్వేల నుంచి విముక్తి కలిగించాలన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. ప్రొబెషనరీ సమయంలో రావాల్సిన బకాయిలను అంజేయాలన్నారు. ఆరు సంవత్సరాలు ఒకే పోస్టులో సర్వీసు పూర్తి చేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. ఉద్యోగులను వారి మాతృశాఖలో విలీనం చేయాలన్నారు. అర్హత గల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలన్నారు.

కార్పొరేట్ సెలూన్లు తొలగించకపోతే ఉద్యమాలు



ఐక్యత చాటుతున్న రాజకీయ పార్టీలు, కుల, ప్రజా సంఘాల నాయకులు

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఏర్పాటు చేసిన కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించకపోతే ఉద్యమాలు చేపడుతామని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ.నల్లప్ప, చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యదర్శి భాస్కరయ్య హెచ్చరించారు. క్షౌ రవృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు అధ్యక్షతన మంగళవారం అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన సదస్సులో వైఎస్సార్ సీపీ, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ, బీఎస్పీ, సీపీఎం, వివిధ కుల, ప్రజాసంఘాల నేతలు పాల్గొని నాయీబ్రాహ్మణులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ సెలూన్ షాపుల వల్ల క్షౌ ర వృత్తిదారుల కుటుంబాలు వీధినపడే ప్రమాదముందన్నారు. స్థానిక అధికారపార్టీ ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని కార్పొరేట్ సెలూన్ షాపుల ఏర్పాటును అడ్డుకుని క్షౌ ర వృత్తిదారులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. సదస్సులో సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు అబ్దుల్‌బాసిద్, నవీన్, జన్నేమస్తాన్, రాజశేఖర్, సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, బీఎస్పీ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ శ్రీనివాసరాజు, వివిధ కుల, ప్రజా సంఘాల నాయకులు దేవేంద్ర, సంపత్‌ఆచారి, మాచర్ల ఎల్లప్ప, స్వామిదాస్, వై.శ్రీనివాసులు, జగ్గిలి రమేష్, క్షౌ రవృత్తిదారుల సంఘం పట్టణ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బ్రహ్మ, బాల, నాయీబ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లింగ నిర్ధారణపై అవగాహన



మాట్లాడుతున్న డీఎల్‌డీఏ ఈఓ వెంకటేష్

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురంలో పశువుల లింగ నిర్ధారణపై రైతులకు పశు వైద్యులు అవగాహన కల్పించారు. మంగళవారం గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద గర్భకోశ చికిత్సలు, పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఏ ఈఓ వెంకటేష్, అనిమల్ హస్బెండరీ డీడీ రమేష్‌రెడ్డి గాలి కుంటు వ్యాధి టీకాల గురించి వివరించారు. పశువులలో ముద్దచర్మ వ్యాధులు ప్రబలకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువుల్లో ధాతులోప నివారణపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. సకాలంలో పశువులు ఎదకు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఉపసంచాలకులు పద్మనాభం, రత్నకుమార్, భారతి, పశు వైద్యులు శ్రీకాంత్, ప్రదీప్, రమేష్, హేమ, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లోపు కులగణన చేపట్టాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీష్

గుంతకల్లు: స్థానిక సంస్థల ఎన్నికల్లోపు కులగణన చేపట్టాలని వివిధ రాజకీయా పార్టీలు, బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవార వివిధ రాజకీయా పార్టీలు, బీసీ సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి సీపీఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, రాష్ట్ర సమితి సభ్యులు గోవిందు, వాల్మీకి సంఘం నాయకులు మాచర్ల ఎల్లప్ప, బి.సుంకప్ప, బి.మహేష్, సూరి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం నాయకులు ఖలీల్, అబ్దుల్ బషీద్, మైనార్టీ నాయకులు ఫ్రూట్ మస్తాన్, ఫజులు, శంషుద్దీన్, కో ఆప్షన్ సభ్యుడు మహబూబ్ బాషా, ఓపీడీఆర్ నాయకుడు సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దౌల్తాపురం ప్రభాకర్, నబీరూసూల్, బీఎస్పీ నాయకులు శ్రీనివాస్‌రాజ్, కురుబ సంఘం నాయకులు సోమశేఖర్, మందాలప్ప, మల్లికార్జున, యాదవ సంఘం నాయకులు రామ్‌రాజు, రజక సంఘం నాయకుడు దేవేంద్రప్ప, బార్ అసోసియేషన్ నాయకులు నాగేశ్వరు, ఖాజ గరీబ్ నవాజ్, నాయి బ్రహ్మణ సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, కటిక సంఘం నాయకులు హీరాలాల్, వడ్డే సంఘం నాయకులు సుబ్బరాయుడు, క్రిస్టియన్ ఫోరం నాయకులు పాల్ తదితరులు హాజరై మాట్లాడారు. తెలంగాణ, కర్ణాటక, బీహార్ రాష్ట్రాల తరహాలో జనగణనతోపాటు కులగణనను చేపట్టి జనాభకు తగిన రిజ్వర్వేషన్లు కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఆ రాష్ట్రాల్లో బీసీలకు అమలు చేసిన 42 శాతం రిజ్వరేషన్లు కల్పించాలన్నారు. కులగణనను చేపట్టకుండా స్థానిక సంస్థ ఎన్నికల నిర్వహించడానికి పూనుకుంటే న్యాయస్థానాలకు ఆశ్రయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్‌ఎండీ గౌస్, దాసరి శ్రీనివాసులు, దేవేంద్ర, ఏఐటీయూసీ నాయకుడు ఈశ్వరయ్య, ప్రజా నాట్య మండలి నాయకుడు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆ నలుగురు సేవాసమితి సభ్యులు

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహానికి ఆ నలుగురు సేవా సమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటారు. మంగళవారం టూటౌన్ పోలీసుల విజ్ఞప్తి మేరకు మృతదేహాన్ని పాతగుంతకల్లులోని హిందూ శ్మశానవాటికకు తరలించి అంతిమ సంస్కారాలు చేశారు. ఆ నలుగురు సేవా సమితి సభ్యులు శ్రీధర్‌రెడ్డి, రవీంద్ర, రత్నమ్మ, అంజి, ఆటోవేణు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వేధిస్తున్న వైద్యుల కొరత.. ఇబ్బందుల్లో రోగులు



గుత్తి ప్రభుత్వాస్పత్రిలో వేచి ఉన్న రోగులు

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. నిబంధనల మేరకు 11 మంది డాక్టర్లు ఉండాలి. అయితే ఏడుగురు మాత్రమే ఉన్నారు. ఇందులో ఒక్క స్పెషలిస్టు కూడా లేరు. గైనకాలజిస్ట్, ఈఎన్‌టీ వంటి స్పెషలిస్టులు లేరు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈఎన్‌టీ లేకపోవడంతో చెవి, ముక్కు, నోరు జబ్బులతో బాధపడే రోగులు అనంతపురం వెళ్తున్నారు. గర్భిణులు, బాలింతలు సైతం స్పెషలిస్ట్ లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. సాధారణ రోజుల్లో ఓపీ రోజుకు 500పై మాటే. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నందున గత నెల రోజులుగా ఓపీ 700కు చేరుకుంది. నర్సుల సంఖ్య కూడా తక్కువగానే ఉంది. సిబ్బంది కొరత ఉంది. ఉన్నతాధికారులు స్పందించి వైద్యులు సిబ్బందిని నియమించడంతో పాటు స్పెషలిస్టులను అందుబాటులో ఉంచాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో వైద్యులను నియమించే అవకాశం ఉంది. అలాగే ఆస్పత్రి అభివృద్ధి పనులు, మరమ్మతుల నిమిత్తం రూ. 1.15 కోట్లకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే అభివృద్ధి పనులతో పాటు మరమ్మతులు చేపడతాం.

– ఎల్లప్ప, ఆస్పత్రి సూపరింటెండెంట్



గుత్తిలో మహిషాసుర మర్దినిగా వాసవీమాత



తాడిపత్రిలో మహిషాసుర మర్దినిగా కాళికామాత



పామిడిలో మహిషాసుర మర్దినిగా వాసవీమాత

జయ జయ మహిషాసుర మర్దినీ..

తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. తొమ్మిదో రోజు మంగళవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. – సాక్షి బృందం



మహిషాసురమర్దినిగా పూజలందుకుంటున్న యాడికి పెద్దమ్మ తలి



గుంతకల్లులో మహిషాసుర మర్దినిగా వాసవీ మాత



గుంతకల్లులో దుర్గాదేవిగా కొల్హాపురి మహాలక్ష్మీ అమ్మవారు



సేవాఘడ్‌లో దుర్గాదేవిగా మాతా జగదాంబ



శింగనమలలో అలంకరణలో దుర్గాదేవి



కల్లూరులో అలంకరణలో దుర్గాదేవి



బుగ్గలో సిద్ధిధాత్రిదేవి అలంకరణలో అమ్మవారు



బీకేఎస్‌లో దుర్గాదేవిగా ముసలమ్మ తల్లి



పెద్దపప్పూరులో పూజలందుకుంటున్న దుర్గాదేవి



కేకే తండాలో అలంకరణలో దుర్గాదేవి



తరిమెలలో దుర్గాదేవి అలంకరణలో చౌడేశ్వరీదేవి

3న మండల సర్వసభ్య సమావేశం

పామిడి: పట్టణంలోని ఎంపీడీఓ సభా భవనంలో ఈ నెల 3న ఉదయం 10.30 గంటలకు మండల మీట్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కే తేజోత్స్న మంగళవారం తెలిపారు. వ్యవసాయం, రెవెన్యూ, వైద్యం, ఆరోగ్యం, విద్య, తాగునీటి, పారిశుధ్యం పాటు తదితర 11 అంశాలతో కలిపి మొత్తం 16 అంశాలపై సమీక్ష ఉంటుందన్నారు. అధికారులు తమ శాఖాపరమైన నివేదికలతో మండల మీట్‌కు హాజరుకావాలన్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ మెంబర్లు, అధికారులు, అనధికారులు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

ఈ- క్రాప్ నమోదు తప్పనిసరి

గార్లదిన్నె: రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ సోమశేఖర్ సూచించారు. మంగళవారం ఏఓ మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామాల్లో పంటలు సాగు చేసిన రైతులు వెంటనే ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ఈ క్రాప్ నమోదు కాక పోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీ, బీమా తదితర సంక్షేమ పథకాలు అందవన్నారు. అలాగే వారం రోజుల్లో ఆర్బీకేలకు యూరియా సరఫరా అవుతుందన్నారు.

క్రీడా మైదానంలో 'శ్రమదానం'

గుత్తి: పట్టణంలోని ఫుట్ బాల్ క్రీడామైదానంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు, క్రీడాకారులు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా గడ్డి, పిచ్చి మొక్కలు, కంప చెట్లు తొలగించారు. సుమారు రెండు గంటల పాటు శ్రమదానం చేసి క్రీడామైదానాన్ని పరిశుభ్రం చేశారు.

IN THE COURT OF HON'BLE DISTRICT JUDGE : ANANTAPUR

G.W.O.P. 42/2025

Shaik Kallamadi Shaiksha Vali, Son of S.K. Ismail, D.No. 1-715-A, Guptha Colony, Pamidi in Pamidi Mandalam, Anantapur Dist. ...Petitioner

Vs.

-Nil- ...Respondent

పై అర్జీ సందర్భ అర్జీదారుడు తన మైనరు కుమారుడు అయిన షేక్ కల్లమడి షఫీక్ అహమ్మద్ కు పెద్దలు ఆస్తి యందు ఉన్న ½ భాగపు ఆస్తిని విక్రయించుటకు కోర్టువారి అనుమతి కోరుతూ అర్జీ దాఖలు చేసి యున్నారు. సదరి అర్జీ 07-10-2025వ తేదీకి వాయిదా వేసియున్నారు. ఈ విషయమై ఎవరికైనను అభ్యంతరములు ఉన్న యెడల, సదరి దినము ఉదయము 10-30 గంటలకు పై కోర్టు యందు స్వయముగా కానీ, వకీలు ద్వారా గానీ హాజరయి మీ అభ్యంతరములు తెలుపుకొనవలయును.

SCHEDULE

Property situated in Pamidi Village in Pamidi Mandalam in S.R.D. of Pamidi and R.D. of Anantapur.

Babu **Sy. No.** **Extent**

Govt. Dry 323/3A A. 7-41 C. Paiki 2-85 C. Paiki Plot No. 59

Measuring : East-West : 25 feet (7-625 M.), **North-South** : 45 feet (13-725 M.), **Total area : 125 Sq. Yds.** And house bearing D.No. 1/1715-A and 1/1715-B constructed in it. The measurements of house are.

East-West : 20 feet (6-100 M.), **North-South** : 33 feet (10-065 M.), **Total area: 660 Sq. Feet.**

Upstairs portion constructed over it with the following measurements

East-West : 20 feet (6-100 M.), **North-South** : 33 feet (10-065 M.), **Total area: 660 Sq. Feet.** and bounded as follows.

East: House constructed over house Plot No. 60, **West:** 25 feet road, **North:** 40 feet road, **South:** Plot No. 58.

జి. శ్రీకాంత్ రెడ్డి, వకీలు, గుత్తి.